www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 23 నవంబర్ 2023
5
తిరుపతి



శాశ్వత పట్టాలిచ్చే వరకూ పోరాటం

ప్రజాశక్తి - నాయుడుపేట



మాచవరం భూబాధితులతో సమావేశం

మాచవరం గ్రామం దళితులకు శాశ్వత పట్టాలిచ్చేంత వరకూ భూపోరాటం కొనసాగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు హెచ్చరించారు. మంగళవారం రాత్రి నాయుడుపేట సుందరరామిరెడ్డి భవన్‌లో భూ సమస్యపై జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వి.నాగరాజు మాట్లాడుతూ దళితులకు గత ప్రభుత్వం సర్వే నంబర్ 207లో సాగు పట్టాలు ఇచ్చిందని, అయితే దళితులు ఆ భూములను సాగు చేసుకుంటుంటే ప్రభుత్వ అధికారులు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. శాశ్వత పట్టాలిచ్చేంత వరకూ పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.ముకుంద, వడ్డేపల్లి చెంగయ్య, పద్మావతి, చంద్రకళ, పుట్టయ్య, మాచవరం గ్రామస్తులు పాల్గొన్నారు.



'ఊపిరి' తీస్తున్న 'రొయ్య'

- జీవిఆర్ ఫ్యాక్టరీలో గబ్బుగబ్బు
- కిలోమీటర్ల దూరం దుర్వాసన
- కన్నెత్తి చూడని పొల్యూషన్ అధికారులు
- కార్మికుల పరిస్థితి దయనీయం



ప్రజాశక్తి - కోట

రాత్రుల్లో చల్లగాలుల్లో, మంచి సువాసనల మధ్య హాయిగా నిద్రపోవాలని అనుకుంటారు.. అయితే జీవిఆర్ రొయ్యల ఫ్యాక్టరీ చుట్టుపక్కల నివాసితులు కిలోమీటర్ల దూరం ఏళ్ల తరబడి దుర్వాసన భరిస్తూ బతుకుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే గబ్బు వాసన వల్ల కార్మికులే కాదు, చుట్టుపక్కల ప్రజలు శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. అయితే పర్యావరణ అధికారులు ఆ ఫ్యాక్టరీ వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాకాలం అయితే దుర్వాసనతో పాటు, వ్యర్థ నీరు సైతం కేశవరం చెరువులోకి, పక్క పొలాల్లోకి యథేచ్ఛగా వదిలేస్తారు. దీంతో ఆయా గ్రామాల్లో బోర్లు వేస్తే రంగునీరు వస్తుందని రైతులు వాపోతున్నారు. తిరుపతి జిల్లా కోట మండలంలోని చిట్టేడు, కేశవరం, మద్దాలి, రాఘవపురం, రామపురం, కొండూగుంట గ్రామాల దయనీయ స్థితి ఇది.

కోట మండలంలోని చిట్టేడు-కేశవరం గ్రామాల మధ్య మెయిన్‌రోడ్డు పక్కనే జీవిఆర్ రొయ్యల పరిశ్రమ ఉంది. ఈ రొయ్యల ఫ్యాక్టరీ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా పొలాల్లోకి, చెరువుల్లోకి కాలుష్య నీటిని వదిలేస్తున్నారు. అంతేకాదు రొయ్యల తలలు తీసి వ్యర్థ నీరు కనీసం క్లోరినేషన్ కూడా చేయడం మానేశారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో దుర్వాసన ముక్కుపటాలదిరేలా భరించలేని విధంగా తయారయ్యింది. రాత్రి వేళల్లో అయితే పరిస్థితి మరీ దారుణం. ఈ ఘాటైన వాసనకు నిద్ర కూడా రావడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

ఈ ఫ్యాక్టరీ నుంచి పొల్యూషన్ ఉన్నతాధికారులకు నెలనెలా ముడుపులు అందడం వల్లనే తమ బతుకుల గురించి ఆలోచించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే చిట్టేడు-కేశవరం గ్రామాల్లో కొంతమంది నాయకులు ఫ్యాక్టరీ నుంచి ముడుపులు తీసుకుని ఎటువంటి ఫిర్యాదు చేయనీకుండా పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఫ్యాక్టరీకి సంబంధించిన సిఎస్ఆర్ నిధులు ఎక్కడికి మళ్లిస్తున్నారన్నది ప్రశ్నార్థకం. ఫ్యాక్టరీ చుట్టూ చెట్ల పెంపకం మరిచారు. క్లోరినేషన్ పనులు చేపట్టడం లేదు. కలెక్టర్, ఆర్డీవో, పొల్యూషన్ అధికారులు స్పందించి రొయ్యల పరిశ్రమ నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేదంటే ఫ్యాక్టరీ ఎదుట నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

వంటావార్పుతో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - గూడూరు



వంటావార్పుతో మున్సిపల్ కార్మికుల నిరసన

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం వంటావార్పుతో నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బి.గోపీనాథ్ ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం నుంచి ప్రదర్శనగా వివేకానందరోడ్డు, ముత్యాలపేట మీదుగా టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకుని ఆర్డీవో ప్రాంగణంలో వంటావార్పు చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు నెలల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తానని, పర్మినెంట్ చేస్తానని వాగ్దానాలు చేశారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా హామీలు పట్టించుకోలేదన్నారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న మాట నిలబెట్టుకోవాలని, క్లాప్ డ్రైవర్లకు జీవోఎంఎస్ నంబర్ 7 ప్రకారం 18,500 జీతం ఇవ్వకుండా కేవలం 10 నుంచి 12వేలు మాత్రమే ఇచ్చి శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. ఓపిఎస్ అమలు చేయాలని, ఆప్కాస్ సంస్థ నుంచి తొలగించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గూడూరు ఆర్డీవో ఎఒకు వినపతిత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు సి.పి.ఎం సెంటర్ శాఖ కార్యదర్శి జోగి. శివకుమార్, గూడూరు సి.ఐ.టి.యు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, కార్యదర్శి యస్.సురేష్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, పామంజి మణి, జిల్లా కమిటి సభ్యులు బి.పెంచల ప్రసాద్ (పి.పి),బి.మురళి, టి.రాఘవయ్య, వెంకటగిరి సి.ఐ.టి.యు జిల్లా సభ్యులు వి. చెంగయ్య, ప్రసాద్, సుబ్బయ్య, బి.చంద్రయ్య, పట్టణ అధ్యక్షులు బి.రమేష్, కార్యదర్శి దారా కోటేశ్వరరావు, శ్రామిక మహిళా సంఘం అధ్యక్షురాలు బి. ప్రభావతి, కార్యదర్శి యం. సంపూర్ణమ్మ, నారాయణమ్మ సుబ్బమ్మ పాల్గొన్నారు. ఎల్.ఐ.సి, పోస్టల్, ఆటో, భవనం, కెవిపిఎస్, వి.ఆర్.ఏ, ఆశ సంఘాల నాయకులు మున్సిపల్ కార్మికులు చేపట్టిన శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు.

బధిర పాఠశాల విద్యార్థికి మెరుగైన వైద్యం: జేఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి అలిపిరి సమీపంలోని టీటీడీ బధిర పాఠశాల వసతి గహంలో మంగళవారం రాత్రి బి.చంద్ర అను విద్యార్థి పొరపాటున స్టోర్ రూంలోని టర్పెంటైన్ ఆయిల్ నోట్లో పోసుకొని ఊదుతూ నిప్పంటించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మంటలు పెరగడం వల్ల ఆ అబ్బాయి అరుపులు విని పక్కనే ఆడుకుంటున్న సహ విద్యార్థులు, డిప్యూటీ వార్డన్, విజిలెన్స్ సిబ్బంది దీనిని గమనించి హుటాహుటిన రుయా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ అబ్బాయి పూర్తిగా టీటీడీ సిబ్బంది పర్యవేక్షణలో ఉన్నాడని, అతని ప్రాణానికి ఎలాంటి ప్రమాదం లేకుండా టీటీడీ తగు జాగ్రత్తలు తీసుకుంటుందని టిటిడి జేఈవో సదా భార్గవి అన్నారు. బుధవారం ఆ విద్యార్థిని ఆమె పరామర్శించారు. బధిర పాఠశాలలో ఎలాంటి గొడవలు జరగలేదని, పాఠశాలలో పెయింటింగ్ వర్క్ జరుగుతున్న క్రమంలో స్టోర్లో టర్పెంటైన్ ఆయిల్ నిల్వ ఉంచడం జరిగిందని, సదరు విద్యార్థి ఈ స్టోర్ రూంలోకి వెళ్ళి తనకు తానుగా ఈ ప్రయత్నం చేశాడన్నారు. మరింత మెరుగైన వైద్య సహాయం అందించేందుకు సదరు విద్యార్థిని వేలూరు సిఎంసికి పంపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సదరు విద్యార్థిని సిఎంసిలో అడ్మిట్ చేశారు. ఈ విద్యార్థి వైద్యానికి అయ్యే ఖర్చును టీటీడీనే పూర్తిగా భరిస్తోందని జేఈవో తెలిపారు.

రజక విద్యార్థిపై దాడి అమానుషం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొమ్మిదో తరగతి బధిర విద్యార్థి చందుపై సహచర విద్యార్థులు దాడి చేసి తీవ్రంగా గాయపరచడం అమానుషమని ఆంధ్రప్రదేశ్ రజక కులవృత్తుల సమాఖ్య నాయకులు అన్నారు. శ్రీకాళహస్తిలోని భరద్వాజ తీర్థంలో ఆ సంఘం పట్టణ అధ్యక్షులు సంజాకుల మురళీకష్ణ మాట్లాడుతూ తిరుపతి టిటిడి సంబంధిత బధిర పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న వడమాల పేట రజక కాలనీకి చెందిన దాము కుమారుడు చందుపై సహచర విద్యార్థులు నిప్పంటించిన ఘటన దారుణమైనదని ఆవేదన వ్యక్తం చేశారు. మాటలు రాని చందుపై కెమికల్ ఆయిల్ పోసి నిప్పు పెట్టారని తానే స్వయంగా రాసి చూపించడం జరిగిందని, దాడి చేసిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుని కఠినంగా శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఇంత తతంగం జరుగుతుంటే హాస్టల్ వార్డెన్ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. నిర్లక్ష్యం వహించిన హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు జయ శ్యామ్, రమేష్, బాబు, డి.మురళి, దూండీ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇంజినీరింగ్ పోస్టుల నియామకం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టీటీడీలో భర్తీ చేయబోతున్న ఇంజినీరింగ్ పోస్టుల నియామక ప్రక్రియ ఎలాంటి సిఫార్సులకూ తావు లేకుండా పూర్తి పారదర్శకంగా జరుగుతోందని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో ఛైర్మన్, ఈవో ఎవి.ధర్మారెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడుతూ టీటీడీ ఇంజినీరింగ్ విభాగంలో 60 పోస్టులు భర్తీ చేసేందుకు టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో ఛైర్మన్‌కు, బోర్డు సభ్యులకు, అధికారులకు ఎలాంటి ప్రమేయం ఉండదన్నారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని అభ్యర్థులను కోరారు. చెన్నై ఐఐటి ఆధ్వర్యంలో పూర్తి పారదర్శకంగా మెరిట్ ప్రాతిపదికన ఈ నియామకాలు జరుగుతాయని వివరించారు. త్వరలో నోటిఫికేషన్ ఇవ్వబోతున్న ఉద్యోగాల నియామక ప్రక్రియను ఇదే తరహాలో పూర్తి పారదర్శకంగా మెరిట్ ఆధారంగానే నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

నేడు శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం ప్రారంభం

అలిపిరిలోని సప్త గో ప్రదక్షిణ మందిరంలో నవంబర్ 23వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమాన్ని టీటీడీ ప్రారంభించనున్నట్లు ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం నుండి నిరంతరాయంగా శ్రీవారి పాదాల వద్ద ప్రతి రోజూ ఈ హోమం నిర్వహిస్తారన్నారు. పెళ్లిరోజు, పుట్టిన రోజు , ఇతర విశేష రోజుల సందర్భంగా భక్తులు ఎవరైనా ఇక్కడికి వచ్చి హోమం చేసుకోవచ్చని తెలిపారు. రూ.1000 చెల్లించి గహస్తులు ఇద్దరు ఈ హోమంలో పాల్గొనవచ్చని చెప్పారు. ప్రస్తుతానికి ఆఫ్ లైన్ లో 50, ఆన్ లైన్ లో 50 టికెట్లు ఇస్తున్నామని , శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యాక స్లాట్ ల విధానంలో టికెట్ల సంఖ్య పెంచుతామని చెప్పారు . ప్రతిరోజు ఉదయం 9 నుండి 11 గంటల వరకు ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ హోమ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలియజేశారు. హోమ ప్రాశస్త్యాన్ని తెలిపేందుకు వేద విద్యార్థులు, అధ్యాపకులు, కళా బందాలతో వేద విశ్వవిద్యాలయం నుండి గురువారం ఉదయం 7 గంటలకు ఊరేగింపుగా సప్త గో ప్రదక్షణ మందిరానికి చేరుకుంటారని వివరించారు. జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

నేడు శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం ప్రారంభం

టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వెల్లడి


విలేకరుల సమావేశంలో టిటిడి ఛైర్మన్, ఈవో

తిరుపతి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



తిరుపతి నగరంలో ట్రాఫిక్ వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తిరుపతి పోలీస్ జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ తెలిపారు. తిరుపతి ఏ.ఆర్. పోలీస్ గ్రౌండ్స్ వద్ద నున్న పోలీస్ కార్యాలయంలో బుధవారం తిరుపతిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్, తిరుపతి ఐఐటి ప్రొఫెసర్స్, ట్రాఫిక్ పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మె.ఎస్.సుబ్బలక్ష్మీ సర్కిల్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా ఐఐటి ప్రొఫెసర్ కష్ణ ప్రపూర్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ గౌరీలు వివరించారు. సుబ్బలక్ష్మీ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ నలువైపులా పెట్టడం వలన వాహనాలు అధిక సంఖ్యలో ఎక్కువ సమయం నిలిచిపోయే పరిస్థితి ఉండడంతో ప్రస్తుతం మ్యాన్ ఫవర్ ద్వారానే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు. శ్రీనివాస సేతుపై అవసరమైన ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు, టర్నింగ్ పాయింట్ల వద్ద సూచిక బోర్డులు, రోడ్డుపై ప్రత్యేక పెయింట్ సూచిక గీతలు ఏర్పాటు చేయించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పి కులశేఖర్ , ట్రాఫిక్ డిఎస్పి నరసప్ప, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఏయికామ్ సంస్థ ప్రతినిధి భాలాజీ, ఆప్కాన్ సంస్థ ప్రతినిధి రంగస్వామి, హెల్త్ ఆఫిసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

'ఆయుష్'కు నూతన 'శోభ'

నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా కొత్త రూపు

యోగాసనాలపై ప్రజలకు శిక్షణ:ప్రసన్నలక్ష్మి



నాడు-నేడులో భాగంగా హోమియో ఆస్పత్రికి రంగులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సనాతన వైద్య సేవలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుష్ వైద్యశాలలకు నూతన రంగు లద్దుతూ వైద్య సేవలను మెరుగు చేయడానికి తగిన చర్యలకు ఉపక్రమించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 599 వైద్యశాలల్లో మొదటి దశలో 110 వైద్యశాలలను దాదాపుగా 3.5 లక్షలతో పెయింటింగ్, ప్లంబింగ్, పరిసరాలకు టైల్స్, ఎలక్ట్రికల్ పనులకు నిధులు వినియోగించి నూతన రూపును తీసుకొచ్చారు. మొదటి దశలో చెపట్టిన అభివృద్ధి పనులు సంతృప్తికరంగా ఉండడంతో రెండో దశ పనులకు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలుస్తోంది.

మంగళంలో.....మంగళం ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇక్కడి ప్రజలకు హోమియో వైద్య సేవలను విస్తృతం చేయడానికి అధికారులు మంగళం ప్రభుత్వ హోమియో వైద్యశాలను నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌సెస్ సెంటర్‌గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు పంపించారు. నేడు ప్రభుత్వ హోమియో వైద్యశాల చాల చక్కటి రూపును సంతరించుకుంది.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి



మంగళం ప్రాంతంలో దశాబ్దాల కాలంగా హోమియో వైద్యశాల ప్రభుత్వ ఆధీనంలో నడుస్తోంది. స్థానికంగానే కాకుండా దూర ప్రాంతాల నుండి హోమియో వైద్య సేవల కోసం మంగళంకు వస్తుంటారు. ప్రస్తుతం నూతన హంగులతో పాటుగా వైద్య సేవలను విస్తృతం చెయ్యడానికి ప్రభుత్వం తగిన కార్యాచరణ చేస్తోంది. మంగళం ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా అదనంగా యోగా శిక్షకులను త్వరలోనే నియమించనున్నారు. స్థానికంగా ఉన్న ప్రజలకు యోగాసనాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం ఎలా సంపాదించుకోవచ్చు అనే అంశాలను ఆయా కాలనీలకు వెళ్ళి అవగాహన కల్పించనున్నారు. హోమియో వైద్య సేవలను స్థానికంగా ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.

– డాక్టర్ ప్రసన్నలక్ష్మి, వైద్యాధికారిణి, ప్రభుత్వ హోమియో వైద్యశాల, మంగళం.


అన్నదానం

ఘనంగా డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కమిటీ కార్యదర్శి, ఎలైట్ ఆసుపత్రి అధినేత డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం జన్మదిన వేడుకలు బుధవారం తిరుపతిలో అట్టహాసంగా నిర్వహించారు. డాక్టర్ కోడూరు సుబ్రమణ్యం జన్మదినం సందర్భంగా అభిమానులు, శ్రేయోభిలాషులు అనుచరులు, పార్టీ నాయకులు ,ఆటో యూనియన్ డ్రైవర్లు నగరంలో పెద్ద ఎత్తున పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నగర మాజీ అధ్యక్షులు కరణం హిమత్ ఆధ్వర్యంలో రుయా ఆసుపత్రి వద్ద రోగులకు అన్నదానం చేశారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షుడు నరసింహ యాదవ్, కార్పొరేటర్ ఆర్ సి మునికష్ణ , టిడిపి సీనియర్ నాయకులు వూకా విజయ్ కుమార్ పాల్గొన్నారు.కపిలతీర్థం వద్ద సతీష్ ఆధ్వర్యంలో జరిగింది.



శ్రీసిటీని వరించిన అవార్డు

ప్రజాశక్తి-వరదయ్యపాలెందేశంలోని ప్రముఖ వ్యాపార ప్రచురణ సంస్థ వ్యాపార రంగంలో లోతైన విశ్లేషణకు ప్రసిద్ధి చెందిన బిజినెస్ వరల్డ్ నిర్వహించిన సస్టైనబుల్ వరల్డ్ కాన్క్లేవ్ అండ్ అవార్డ్స్ 5వ ఎడిషన్‌లో 'ఇండియాస్ మోస్ట్ ఇన్నోవేటివ్ సస్టైనబిలిటీ ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్' అవార్డును శ్రీసిటీ సొంతం చేసుకుంది. మంగళవారం సాయంత్రం ముంబైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బిజినెస్ వరల్డ్ ఛైర్మన్ అండ్ ఎడిటర్-ఇన్-చీఫ్ డాక్టర్ అనురాగ్ బాత్రా నుండి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ అవార్డును అందుకున్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ వ్యక్తి మృతి


ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో




చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాసులు చర్యకు నిరసనగా మణికంఠ అనే వ్యక్తి పెట్రోల్ పోసుకొని రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. తిరుపతి రుయా హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. తిరుపతి జిల్లాలోని చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో మణికంఠ అనే వ్యక్తి , తన భార్య మరొకరితో పారిపోయేందుకు కానిస్టేబుల్ సహకరించాడని ఆందోళన వ్యక్తంచేశాడు. ఇదే విషయమై కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రెండు రోజుల కిందట స్టేషన్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. 70 శాతం కాలిన గాయాలతో అతడిని రుయా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. భార్యను మరిచిపోవాలని కానిస్టేబుల్ శ్రీనివాసులు బెదిరించాడని , లేకపోతే చోరీ కేసులో ఇరికించి వేస్తానని బెదిరించాడని బాధితుడు మణికంఠ పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో చంద్రగిరి పోలీస్ స్టేషన్ ముందే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బుధవారం మతి చెందారు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీ సర్వ శ్రేయస్ ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

తిరుపతి బ్యూరో : తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన బాలక్రిష్ణ బుధవారం ఎస్వీ సర్వ శ్రేయస్ ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు విరాళం డిడిని తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జేఈవో సదా భార్గవికి దాత అందజేశారు.



1 నుంచి ఓటింగ్ యంత్రాలపై అవగాహన : కలెక్టర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డిసెంబర్ 1 నుండి ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నామని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఎస్ఆర్ – 2024పై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ వివరిస్తూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో మొబైల్ వాహనాల ద్వారా జిల్లాకు చేరిన ఎం-3 ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు. అన్ని వివరాలతో గుర్తించిన మరణించిన ఓటర్లను జాబితానుండి త్వరగా తొలగించడానికి ఇ ఆర్ ఓ లు చర్యలు తీసుకుంటున్నారని, స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యం అని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నగేష్ , సుధా రెడ్డి, ఎంపి నాయుడు , జయచంద్ర, రవి, రెవెన్యూ డివిజనల్ అధికారులు నిశాంత్ రెడ్డి, కిరణ్ కుమార్ , రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు వైయస్సార్ కళ్యాణమస్తు లబ్ది

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఈ నెల 23న తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానం లో నాలుగో విడత వైయస్సార్ కళ్యాణమస్తు, వైయస్సార్ షాదీ తోఫా లబ్ధిని కంప్యూటర్ బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని కలెక్టర్ కే.వెంకట రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ నుండి ఉదయం 10:30 గంటలకు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్దిదారులు పాల్గొంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కులగణనకు అంతా సిద్ధం

ప్రజాశక్తి-వెంకటగిరి

కులగణన ఈనెల 27వతేది నుండి వచ్చే నెల 3వతేదిలోపు పూర్తి చేయాలని సోషల్ వేల్ఫేర్ జిల్లా అధికారి చిన్నయ్య తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణన ఏలా చేయాలో మండలస్థాయి అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో సిబ్బంది వాలంటీర్ల ద్వారా ఈకార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ విజయలక్ష్మీ, ఇరిగేషన్ అధికారులు తోట భూపతి, సోషల్ వేల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

5 అడుగుల నేల...హాంఫట్

పాఠశాల స్థలం దర్జాగా కబ్జా

ప్రజాశక్తి - వెంకటగిరి

వెంకటగిరి పట్టణ పరిధిలోని 24వవార్డు పరిధిలోని పాతకోట ఈస్ట్ ప్రాథమిక పాఠశాల స్థలం ఆక్రమణకు గురవుతోంది. పాఠశాల వెనుక భాగంలో నివసిస్తున్న కసరు కోటేశ్వరరావు పాఠశాల ప్రహరీగోడను తొలగించి మూడు అడుగులు లోపలకు వెళ్ళి తన నిర్మాణాన్ని చెపట్టాడు. పాఠశాల ఆవరణంలో తన సెప్టిక్‌ట్యాంకును ఏర్పాటు చేసుకొని యథేచ్ఛగా వాడుకుంటున్నాడు. నడిరోడ్డులో బోరు వేసుకున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. ఇంత జరుగుతున్నా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మండల విద్యాశాఖాధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆక్రమణదారుడు రెచ్చిపోయాడు. కూతవేటు దూరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నివాసం ఉన్నా తనకు ఏమీ పట్టనట్లు వ్యవహరించడంతో అతని అండదండలూ పుష్కలంగా ఉన్నాయని స్థానికుల్లో అనుమానం రెకెత్తిస్తోంది. ఇదే వరుసులో ఉన్న పాఠశాల వెనుక భాగాన ఇంటి నిర్మాణాల వరుసలు గమనిస్తే ఇతను ఆక్రమించినట్లు స్పష్టంగా కనబడుతోంది. స్థానికుల ఫిర్యాదుతో కదిలిన విద్యాశాఖాధికారులు ఈస్థలం వెంకటగిరి రాజాలు దానం చేశారని , దీనికి సంబంధించి డాక్యుమెంట్ తమ వద్ద లేదని, ఈ ఆక్రమణ వ్యవహారాన్ని మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులకు అప్పజెప్పినట్లు మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. దాదాపు ఐదు అడుగులు పాఠశాల ఆక్రమణ గురవడం గమనార్హం.


స్కూలు స్థలం ఆక్రమించి నిర్మాణం చేపడుతూ...

విహెచ్‌సిలో మెరుగైన వైద్యం అందించాలి



విహెచ్‌సిలో రికార్డులు తనిఖీ చేస్తున్న వైద్యాధికారి చైతన్య

ప్రజాశక్తి -దొరవారిసత్రం : గ్రామీణ ప్రజలకు అందు బాటులోనే వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని దొరవారి సత్రం పిహెచ్‌సి వైద్యాధికారి వి. చైతన్య సూచించారు. బుధవారం ఆయన ఏకొల్లు విలేజ్ హెల్త్ క్లినిక్ ని ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, దినసరి ఓపి, పలు రికార్డులను పరిశీలించారు. విహెచ్‌సికి వచ్చే రోగులకు వారి రోగస్థితికి తగిన వైద్య సేవలు అందించాలని ఎంఎల్‌హెచ్‌పిని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న ఏఎన్ఎమ్స్ వారి పనితీరును మెరుగు పరుస్తూ ఎప్పటికప్పుడు ఆన్‌లైను చేస్తూ పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనం, జగనన్న గోరుముద్ద, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వంటకాలు వడ్డించాలని తెలిపారు. ఆ గ్రామ పరిధిలోని గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులకు పలు సూచనలు, సలహా లు ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో హెల్త్ సూపరు వైజర్ గోపి కిరణ్, ఏఎన్ఎంలు శ్రావణి, డోరతి, సురేఖ, ఆశ కార్యకర్త మంజుల పాల్గొన్నారు.

ధాన్యం మద్దతు ధరకు నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి -చిన్నగొట్టిగల్లు: రైతు ధాన్యానికి మద్దతు ధర పొందడానికి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధ నలు తప్పని సరిగా పాటించాలని మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి రైతులకు సూచించారు. బుధవారం గోటూరువాండ్లపల్లి, మూరే వాండ్లపల్లి, తవ్వా వాండ్లపల్లి, చల్లేవారిపాళెం రైతులు సాగు చేసిన వరి పొలాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. అధిక దిగుబడులు సాధించేందుకు తగు యాజమాన్య పద్ధతులు సూచించారు. ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యానికి మంచి మద్దతు ధర పొందాలంటే కొన్ని నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. దళారుల దోపిడీని నిరోధించేందుకు ధాన్యానికి సంపూర్ణ మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం కనుగోలు చేసి ఆ డబ్బును నేరుగా రైతు బ్యాంకు ఖాతా లో జమ చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో వి.హెచ్.ఏ కిషోర్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి ధనలక్ష్మి

బాబు వస్తే భవిష్యత్తు గ్యారంటీ: టిడిపి

ప్రజాశక్తి -కెవిబిపురం: కెవిబి పురం మండల టిడిపి అధ్యక్షులు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంటు రైతు అధ్యక్షులు క్లస్టర్ ఇంచార్జ్ కనపర్తి గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గురుకుల కండ్రిగ గ్రామ పంచాయతీ 'బాబు ష్యూరిటీ. భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి గ్యారంటీ బాండ్‌లను, కరపత్రాలను అందజేసి బాబు భవిష్యత్ గ్యారంటీ పథకాలను చదివి వినిపించారు. టిడిపి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్ రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షులు చంద్రయ్య నాయుడు, యువత అధ్యక్షులు మునికుమార్ యాదవ్, సర్పంచ్ రవి, మాజీ యంపిటిసి రామచంద్ర రెడ్డి, మీనాక్షమ్మ, బలరాం రెడ్డి, ఎ బలరాం రెడ్డి , వెంకటస్వామి, గ్రామ పంచాయతీ నాయకులు, కార్యకర్త లు, మహిళలు, యువత రైతులు పాల్గొన్నారు.

పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసమే 'సాన్స్'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించడానికే సాన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శాంత కుమారి అన్నారు. మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటుగా అంగన్ వాడీ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. పిల్లల్లో ఊపిరితిత్తుల సమస్యలు, ప్రస్తుతం విష జ్వరాలు, ఐరన్ శాతం పెంచడం ఇలా సంపూర్ణ ఆరోగ్య వంతు లుగా చేయడానికి ఫిబ్రవరి 24వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ మురళి, స్టాఫ్ నర్స్ నదియా, ఫార్మసిస్ట్ అంకిరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి- రేణిగుంట : విద్యార్థులను రేపటి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పాత్ర కీలకమని రెయిన్బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ అతావుల్లా ఖాన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని రైన్బో ఈ స్మార్ట్ స్కూల్లో ప్రీప్రైమరీ సూడెంట్స్ తో ఎస్ ఎల్ సి స్టూడెంట్స్ లెడ్ కాన్ఫరెన్స్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ, జూనియరీ కె.జీ సీనియర్ కె.జీ చిన్నారులు తమ తరగతి గదిలో నేర్చుకున్న వివిధ అంశాలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో బుధవారం విద్యా విషయకం పరిపాలన సంబంధమైన తనిఖీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్. ప్రభుత్వ కళాశాల విద్యాశాఖచే అడ్వైజర్స్‌గా నియమితులైన డాక్టరు సియన్ లత, డా ఏ ఇందిరా ప్రియదర్శిని బుధవారం కళాశాలను సందర్శించి అన్ని విభాగాలను తనిఖీ చేశారు. విద్యా సంబంధమైన అన్ని రికార్డులను.క్షుణంగా పరిశీలించి కళాశాల పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రీయ సేవాసమితి(రాస్) మహిళా పొదుపు సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి ఈ వెంకటరత్నం, నాగరాజు, రాస్ అధికారులు రవి,ప్రకాష్, తేజు, శేఖర్, శివ, రెడ్డికుమాలి, మెహతాజ్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అపోలో రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టం



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఆరోగ్య సంరక్షణలో మరో కొత్త శకానికి నాంది పలుకుతూ, అపోలో క్యాన్సర్ సెంటర్ దక్షిణాసియాలో మొట్టమొదటి సైబర్‌నైఫ్- రోబోటిక్ రేడియో సర్జరీ సిస్టమ్‌ని పరిచయం చేసినట్లు రేడియేషన్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మహదేవ్ పోతరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్యాన్సర్, క్యాన్సర్ కాని కణితులకు ఖచ్చితమైన చికిత్సా విధానాన్ని అందిస్తోంది. సైబర్‌నైఫ్ సిస్టమ్ ప్రవేశం క్యాన్సర్ సంరక్షణ, టెక్నాలజీలో ఒక గొప్ప ఘట్టాన్ని సూచిస్తుందన్నారు. దక్షిణాసియాలో ఈ అద్భుతమైన టెక్నాలజీని ప్రవేశపెట్టిన మొట్టమొదటి సంస్థ అపోలో క్యాన్సర్ సెంటర్ అవడం ద్వారా, ఇది కొత్త మైలురాయిని చేరుకుందని తెలిపారు. సైబర్‌నైఫ్ ఎస్7 ఫిమ్ సిస్టమ్ అనేది క్యాన్సర్, క్యాన్సర్ కాని కణితులకు రేడియేషన్ థెరపీని సూచించే ఇతర పరిస్థితులకు నాన్-ఇన్వాసివ్ చికిత్స. ఇది మెదడు, ఊపిరితిత్తులు, వెన్నెముక, ప్రోస్టేట్, పొత్తికడుపు క్యాన్సర్‌లతో సహా శరీరం అంతటా ఉన్న పరిస్థితులకు చికిత్స చేయడానికి ఉపయోగిస్తారు. శస్త్రచికిత్స చేయలేని లేదా శస్త్రచికిత్స ద్వారా సంక్లిష్టమైన కణితులు ఉన్న రోగులకు శస్త్రచికిత్సకు ప్రత్యామ్నాయంగా ఉండవచ్చు అని పేర్కొన్నారు. గతంలో రేడియేషన్‌తో చికిత్స పొందిన రోగులు, మెటాస్టాటిక్ గాయాలు, పునరావృత క్యాన్సర్లు ఉన్నవారు కూడా సైబర్‌నైఫ్ చికిత్సను పొందవచ్చని తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగం భావితరాలకు విఘాతం

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, బిసిడిఇ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ తుమ్మలగుంట తిరుపతి రూరల్‌లో " వీ కాన్ ప్లాస్టిక్ ఫ్రీ స్కూల్ క్యాంపస్ క్యాంపెయిన్ " అనే అంశంపై ప్లాస్టిక్ విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జడ్పీ హైస్కూల్ , తుమ్మలగుంట ప్రధానోపాధ్యాయురాలు పి. భారతి మాట్లాడుతూ మానవుడు తన చుట్టూ ఉన్న వనరులను ఉపయోగిస్తూ తన అవసరాల కోసం ప్లాస్టిక్ వంటి కాలుష్యకారక పదార్థాలను తయారు చేస్తున్నాడని వాటి వల్ల మానవ మనుగడకే ముప్పు పొంచి ఉందని, ప్రధానోపాధ్యాయురాలిగా తాను స్కూల్లో సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉంటున్నానని పిల్లలు కూడా ప్లాస్టిక్ దుష్పరిణామాలు గురించి తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్లాస్టిక్ వినియోగాన్ని దూరం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా విచ్చేసిన డాక్టర్ డి. రేఖ ప్లాస్టిక్ కాలుష్య కారకాలు ప్లాస్టిక్ కాలుష్య అనర్థాల వల్ల మానవ ఆరోగ్యం పై పడే ప్రభావాలను వివరిస్తూ ప్లాస్టిక్ నిర్మూలనకు రెడ్యూస్ రియూస్ రీసైకిల్ అండ్ రెఫ్యూజ్ అనే విధానం ద్వారా విద్యార్థులు తీసుకోవలసిన బాధ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అబ్రహం, బి. గణేష్, సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్ ప్రతినిధి డాక్టర్ డి రమణ, డైరెక్టర్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్ ప్రొఫెసర్ కె.సుధారాణి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి: డిఎల్‌డిఓ

ప్రజాశక్తి - బాలాయపల్లి : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార మార్గం చేపట్టేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని తిరుపతి జిల్లా డిఎల్‌డిఓ వాణి రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉన్న స్త్రీ శక్తి భవనంలో మండల శాఖ అధికారులు, సచివాలయ సిబ్బందితో అంటు వ్యాధులు, పారిశుద్ధ్యం, తాగు నీటిపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ కారణం వల్ల పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించి అంటువ్యాధులు ప్రబల కుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి వారి బాగోగులు తెలుసు కోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. దళ వారీగా సచివాలయం పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో డ్రైడే లాంటి కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. జనాభా ప్రాతి పదికను బట్టి తాగునీటికి కావాల్సిన వసతులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసుకొని ఉండా లన్నారు. సంబంధిత అధికారులు అడిగిన వెంటనే ఆ ప్రతిపాదనలను జిల్లా కార్యాలయానికి పంపించేందుకు సిద్ధంగా ఉండాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు.

బాధ్యతగా పనిచేయాలి

సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ వెళ్లి ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలు తెలుసుకొని వారి అవసరాలను వెంటనే పరిష్కరించేందుకు మండల పరిషత్ అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రమీల రాణి, ఏఓ వినీల్ కుమార్, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌డిఓ వాణి

డాక్టర్ రాజశ్రీ పట్టుదల ఆదర్శనీయం

ప్రజాశక్తి- రేణిగుంట: గాజుల మండ్యం గ్రామానికి చెందిన డాక్టర్ రాజశ్రీ స్వయం కృషి, పట్టుదల ఆదర్శనీయమని ఎంఎ జబ్బర్ ట్రస్ట్ అధినేత డాక్టర్ షేక్ ఫరీద్ బాబా అన్నారు. బుధవారం రేణిగుంట మండలంలోని గాజులమండ్యం గ్రామానికి చెందిన బెనర్జీ సతీమణి రాజశ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ నుండి అప్లైడ్ మైక్రో బయాలజీ కెమిస్ట్రీ విభాగం నుండి గౌరవ డాక్టరేట్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎ జబ్బర్ ట్రస్ట్ అధినేత షేక్ ఫరీద్ బాబా హసీనా గాజుల మండ్యం గ్రామానికి చేరుకొని పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాజశ్రీ డాక్టరేట్ అందుకోవడం మండలానికే గర్వకారణం అన్నారు. రాజశ్రీ పట్టుదల స్వయంకృషితో తమ కీర్తిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని ఆనందం వ్యక్తం చేశారు. రాజశ్రీని ఆదర్శంగా తీసుకొని మహిళలు అన్ని రంగాలలో ముందుకెళ్లాలని కోరారు. డాక్టరేట్ పొందిన రాజశ్రీని సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల మండ్యం ప్రముఖులు జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



రాజశ్రీని అభినందిస్తున్న షేక్ ఫరీద్ బాబా

టీడీపీ, జనసేన నాయకుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆధ్వానంగా మారిందని వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతూ జంబుగోళం రోడ్డు ఆర్ అనంతపురం గ్రామం వద్ద టిడిపి, జనసేన నాయకులు వరినాట్లు నాటి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ శ్రీకాహస్తి – తడ రోడ్డు నుంచి 16 గ్రామాల మీదగా జంబుగోళం. రోడ్డును అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్మించిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రోడ్డుకు ఇప్పటి వరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదని, స్థానిక ఎమ్మెల్యే, ఆయన అనుచరులు ఈ మార్గంలో ఉన్న ఇసుక రీచ్ నుంచి ఇసుకను తమిళ నాడుకు ఆక్రమంగా తరలించడంతో ఏడు కిలోమీటర్లు రోడ్డు ధ్వంసం అయిందన్నారు. ఐదు సంవత్సరాలయినా ఈ రోడ్డుకు తట్టెడు మట్టిని వేసిన దాఖలాలు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



ఉత్తమ సేవా పతక గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-పాకాల: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్ మాన్ కె విశ్వనాథ్ బుధవారం అగ్నిమాపక సిబ్బంది ఉత్తమ సేవా పతాకం పురస్కారం చేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో లీడింగ్ ఫైర్ మాన్ కె విశ్వనాథన్ చేసిన సేవలను అగ్నిమాపక అధికారులు , సిబ్బంది గుర్తించి సన్మానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రైతు నేస్తం: సిఇవో

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా డిసెంబర్ ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు రైతు నేస్తం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కేంద్ర సహకార బ్యాంకు సీఈవో వై సరిత తెలిపారు. గూడూరు పట్టణంలోనీ ఎంపిడివో కార్యాలయంలో గూడూరు డివిజన్ పరిధిలోని సహకార సంఘాల సిఈఓ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు నాగేంద్ర కుమారి, దయాకర్ రెడ్డి, మధు, ఏజీఎం చంద్ర, గూడూరు బ్రాంచ్ మేనేజర్ సత్యవతి, గూడూరు కోట వాకాడు నాయుడుపేట సూళ్లూరుపేట బ్రాంచ్ ల మేనేజర్లు, సూపరువైజర్లు, సహకార సంఘాల సీఈవోలు సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ లెవెల్ అథ్లెటిక్స్ లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నేషనల్ లెవెల్ అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శ్రీకాళహస్తి మండలం కాపు గున్నేరి పంచాయతీలో ఉన్న కోకాకోలా బ్రాంచ్ మేనేజర్ రాజ్ కుమార్, తులసి బ్రింద దంపతుల కుమార్తె ఆర్.తనిష్క, పట్టణంలోని ఓ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 8వ తరగతి చదువుతూ రన్నింగ్ రేస్ లో సాధన చేసింది. స్నేహితులు ఆర్ అదితి, ఆర్ చరణె, కె శాతర్షలతో కలిసి ఈనెల 7న చత్తీష్ఘడ్ లో నిర్వహించిన నేషనల్ లెవెల్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ – 14 100 మీటర్ల రిలే పరుగు పందెంలో పాల్గొనడంతో వారు విజేతలుగా నిలిచారు. దీంతో ప్రతిష్టాత్మక "బ్రాంజ్" మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం తోపాటు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషుల అభినందనలు అందుకున్నారు.

సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్స్ నిరసన

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో సచివాలయాలలో పని చేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్స్ ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివా లయాల వ్యవస్థలో ఎనర్జీ అసిస్టెంట్ల నియామకం జరిగిందని, అయితే ట్రాన్స్‌కో సిబ్బంది పూర్తి స్థాయిలో తమను రాత్రి పగలు ఉపయో గించుకుంటున్నారని తెలిపారు. సచివాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పని చేసే విధంగా తమకు అనుమతివ్వాలని కోరారు.

వడ్డెర్లను ఎస్‌టి జాబితాలో చేర్చాలని పాదయాత్ర

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తరతరాలుగా నిరుపేదలుగా బతుకు వెళ్ల దీస్తున్న వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ తిరుపతి వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాపాదయాత్రకు శ్రీకారం చుట్టారు. అలిపిరి శ్రీవారి పాదాల వద్ద బుధవారం ప్రారంభమైన ఈ మహా పాద యాత్ర విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గ పాదాల వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ మణి, కె.నరేష్, టి. సహదేవయ్య, టి.అనిల్ కుమార్, జరిపిటి కుమార్ పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ అభివృద్ధికి కృషి: తుడా ఛైర్మన్

ప్రజాశక్తి - క్యాంపస్ : పట్టణీకరణ దిశగా తిరుపతి రూరల్ మండలం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఎంపీపీ, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తిరుపతి రూరల్ మండలం సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అధ్యక్షతన సాగింది. అనంతరం రెవెన్యూ, పోలీస్, వ్యవసాయం, వెలుగు తదితర విభాగాల అధికారులతో చర్చించారు. ప్రజా ప్రతినిధుల నుంచి స్వీకరించిన వినతులను వచ్చే సమావేశంలోపు వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, యశోద, ఎంపిడిఓ రమేష్ బాబు, తహశీల్దార్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రిమ్స్‌లో నూతన విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్: స్థానిక కొండారెడ్డి రాయలసీమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ (రిమ్స్) లో నూతన ఎంసీఏ, ఎంబీఏ, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాల్లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టిపల్లి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ఆస్తికంగా చదువు మిన్న అని వెల్లడించారు. విద్యార్థులు క్రమ పద్ధతిగా తరగతులు చక్కగా హాజరై శ్రద్ధగా చదివి ఉన్నతరంగాల్లో రాణించాలని సూచించారు. ప్రతి సంవత్సరం ఎంతోమంది విద్యార్థులు డిగ్రీ పట్టుకొని బయటకు వస్తున్నారని కంపెనీలలో ఉద్యోగాలు ఉన్న అర్హత పొందలేకపోతున్నారని అన్నారు. దీనికి ప్రధాన కారణం విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడమేనని అన్నారు. విద్యార్థులు ప్రతి పనిలో ఏకాగ్రతతో, విశ్వాసంతో కమ్యూనికేషన్ స్కిల్స్ పై శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి. నిరంజన్ రెడ్డి, ఎంసీఏ విభాగాధిపతి పి.మధుర, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి

వర్షపు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట

జేసిబి సాయంతో పూడిక తీత

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని గూడలి స్వర్ణముఖి బ్రిడ్జి సమీపంలో వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న ఇసుక పూడికను తిరుపతి జిల్లా వైసీపీ యువజన ప్రధాన కార్యదర్శి నేదురుమల్లి హరీష్ చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో తొలిగించడంతో పైనుండి ప్రవహిస్తున్న నీరు మొత్తం వాకాడు దిగువ బాగానికే కాకుండా పెన్నక్క చెరువుకు ప్రవహించే విధంగా జేసీబీ తో మరమ్మతులు చేసి ముందుస్తు అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా నేదురుమల్లి హరీష్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పంటలు పుష్కళంగా పండించుకోవడానికి వర్షాలు కోసం రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకూడదని వర్షపు నీటిని వృథా కాకుండా జాగ్రత్తగా పెన్నక్క చెరువుకు పంపే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు భయభ్రాంతులకు గురికాకుండా వరినాట్లు కొనసాగించ వచ్చన్నారు. గతంలోనూ రైతులు కోసం మరెన్నో ఉపయోగకర పనులు చేశామని గుర్తు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : క్రీడలు మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని జీవితంలో ఉపయోగపడే ఎన్నో విషయాలు నేర్పుతాయని విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుందరవల్లి తెలిపారు. గూడూరు పట్టణం లోనీ ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ గేట్ మెన్స్ క్రీడా పోటీలను రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుందరవల్లి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. క్రీడలు ఎన్నో నేర్పుతాయని గెలుపు ఓడిపోయినప్పుడు బాధను దాచుకోవాలని, క్రీడా స్ఫూర్తి నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో క్రీడలను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం వైస్ ఛాన్సలర్‌ను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రారు రామచంద్రారెడ్డి, ఎస్‌కేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, పీడీ నారాయణరాజు, అధ్యాపకులు మల్యాద్రి, వెంకటేశ్వర్లు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని కూరపర్తివారిపల్లి పంచాయతీ ఆవులయ్యగారిపల్లి గ్రామంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కంటి వెలుగును నిర్వహించారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న ఆరోగ్య సురక్షలో గతంలో కంటి పరీక్షలు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ కంటి అద్దాలు అందజేసి గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు 50 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇచ్చి కంటి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - కోట : ఈ నెల 27వ తేదీ నుంచి కుల డిసెంబరు 4వ తేదీ వరకు కుల గణన నిర్వహించనున్నట్లు స్పెషల్ ఆఫీసర్ గూడూరు డీఎల్పీఓ వెంకటరమణ, వాకాడు ఎంపిడిఓ గోపినాథ్, కోట ఎంపిడిఓ భవాని అన్నారు. ఈ సందర్భంగా బుధవారం కోట మండలంలోని ఎంపిడిఓ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంపిడిఓ భవాని ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, హెల్త్ డిపార్టుమెంట్, పలు శాఖల సిబ్బందితో కులగణన సర్వేపై అవగాహన నిర్వహించారు. సచివాలయం డిడిఓలు, గ్రామ వాలంటీర్లకు వీటిపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, డిఎల్‌పీవో వెంకటరమణ, వాకాడు ఎంపిడిఓ గోపినాథ్, కోట ఎంపిడిఓ భవాని, ఎంపిపి దాసరి అంజమ్మ, తహశీల్దారు పద్మావతి, అంగన్‌వాడీ సీడిపిఓ మునెమ్మ, అగ్రికల్చర్ ఏఈ నిరంజన్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఎంపిడిఓ దేవేంద్ర బాబు సిబ్బందికి సూచించారు. ప్రతి వాలంటీరు తన పరిధిలో వున్న కులాల వారిగా సర్వే నిర్వహించి నివేదికలు తయారు చేసి పంచాయతీ కార్యదర్శులకు సమర్పించాలన్నారు. వాలంటీర్లతో రోజు వారి 'సమీక్ష లు నిర్వహించి సకాలంలో పూర్తయే విధంగా కార్యదర్శులు శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వర్లు, డివైఎఫ్ ఓ క్రిష్ణ మూర్తి నాయడు, ఈఓపిఆర్డి సోమశేఖర్ రెడ్డి కార్యదర్శులు మదన మోహనరాజు, సతీష్, ఇతర కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వర రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర ఖోఖో పోటీలకు పంగూర్ విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి -ఏర్పేడు: జార్ఖండ్‌లోని రాంచీలో త్వరలో జరగనున్న ఖోఖో గేమ్స్ కు మండలం లోని పంగూరు విద్యార్థులు ఎంపిక య్యారు. బంగారుపాళ్యం జి హెచ్ఎస్‌లో ఇటీవల జరిగిన 67వ స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొన్న మండలంలోని పంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు బాలికల విభాగంలో సీ అమృత, ఎం అర్చన రెడ్డి బాలుర విభాగంలో జి లక్ష్మీప్రసాద్, బి చక్రనాథ్ విజయం సాధించి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విజేతలుగా నిలిచారు. నచ్చనేరి గ్రామానికి చెందిన సి జగన్నాథం రెడ్డి కుమార్తె సి అమృత జాతీయస్థాయి ఖోఖో జట్టుకు జార్ఖండ్ రాష్ట్రంలో రాంచీలో జరగబోయే ఖోఖో గేమ్స్ కు ఎంపికయ్యారు. విజేతలు గా నిలిచిన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ లోకేష్‌ని, జీవి ప్రసాద్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు అంకితభావాన్ని కొనియాడారు.

మళ్లీ జగనే సీఎం కావాలి: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని. ఉమ్మడి నెల్లూరు జిల్లా శాసన మండలి సభ్యులు మేరిగ మురళీధర్ , బత్తిని విజయ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం పక్కనున్న సచివాలయాల సంబంధించి వార్డు కన్వీనర్లు బట్ట గోపి యాదవ్, శివ చైతన్య, జమ్మల వాసు, జమ్మల సుకన్య .ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, వాలంటీర్లు, కార్యకర్తలు వైసీపీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ వైసిపి అధ్యక్షులు బోమిడి శ్రీనివాసులు , గూడూరు పట్టణ జేసిఎస్ కన్వీనర్ రాఘవరెడ్డి, కాంగ్ర నారాయణ రెడ్డి, వైసీపీ నాయకులు బట్ట గోపి యాదవ్, వాకాటి శ్రీధర్ రెడ్డి, అజీజ్ భాయ్ పాల్గొన్నారు.